క్లుప్తంగా

పరిష్కార వేదికలో ఏడు అర్జీలు

తెనాలి రూరల్: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఏడు అర్జీలు దాఖలయ్యాయి. వీటిలో వైద్య ఆరోగ్య విభాగానికి సంబంధించి రెండు, రెవెన్యూ, పోలీస్, విద్యాశాఖ, మున్సిపల్, పంచాయతీ రాజ్ విభాగాలకు సంబంధించి ఒక అర్జీ చొప్పున దాఖలైనట్లు సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులు వెల్లడించారు.

ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగించాలి



తెనాలి అర్బన్: నాజర్‌పేటలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు ఎక్కువగా ఉన్నాయని.. వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికుడు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. అలానే స్థలాన్ని సర్వే చేయించాలని.. ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించాలని పలువురు వినతిపత్రాలు ఇచ్చారు. వీటన్నింటినీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తైక్వాండో బెల్ట్ ఎగ్జామినేషన్



తెనాలి: పట్టణంలోని హరిహంసిక డాన్స్–తైక్వాండో ఇనిస్టిట్యూట్‌లో సోమవారం తైక్వాండో విద్యార్థులకు ప్రాక్టికల్, థియరీ బెల్ట్ ఎగ్జామినేషన్ నిర్వహించారు. ఈ పరీక్షల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పతకాలు, సర్టిఫికెట్లు, బెల్ట్‌లను అందుకున్నారు. కోచ్ ఎం.చిన్నా విద్యార్థులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థుల ప్రతిభను ఆయన అభినందించారు. ఈ పరీక్షలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, మరింత ముందుకు సాగేందుకు ప్రేరణనిచ్చాయని తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు.

స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



తెనాలి అర్బన్: రాష్ట్రంలోని అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులను కూటమి ప్రభుత్వం పంపిణీ చేస్తోందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. 14, 17, 24 వార్డులలో సోమవారం ఆయన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బోయపాటి అరుణ, దివి అనిత, తోక శిరీష, టీడీపీ నాయకులు మహ్మద్ ఖుద్దూస్, పినపాటి రవీంద్ర, అన్నం మల్లీశ్వరి, రవితేజ, రమాదేవి, రమ్య, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగింపు



తెనాలి అర్బన్: రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్పా యేసుబాబు ఆదేశించారు. సుల్తానాబాద్‌లో సోమవారం జరుగుతున్న పిచ్చి మొక్కల తొలగింపు పనులను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఉండడం వల్ల వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. దీంతో మొక్కల తొలగింపు కార్యక్రమాన్ని చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, పలువురు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

అబద్ధపు హామీలతో ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వం

కొల్లూరు: మోసపూరిత హామీలతో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసగిస్తోందని ఎంపీపీ–2 కనపర్తి మాణిక్యం అన్నారు. మండలంలోని తాడిగిరిపాడులో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ అందజేయడంతో పాటు, ప్రభుత్వ సేవలను ఇళ్ల వద్దకు చేర్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు అమలుకాని హామీలిచ్చి అవి నెరవేర్చడంలో విఫలమయ్యిందని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు కనపర్తి మోహన్‌రావు, మద్దల యకోబు, మాజీ సర్పంచి పిల్లి ప్రేమ్‌రాజు, గద్దె యోహాన్, మద్దాల దావీదు తదితులు పాల్గొన్నారు.



కఠెవరం – ఆటోనగర్ రహదారిలో..



కొలకలూరులో..

కంపుగొడుతున్న రహదారులు

- ఇష్టారాజ్యంగా వ్యర్థాల డంపింగ్
- ఎట్టించుకోని అధికారులు
- దోమలకు ఆవాసంగా తాగి పడేసిన కొబ్బరి బొండాలు
- సీజనల్ వ్యాధులతో అల్లాడుతున్న ప్రజలు



నందులపేటలో..

తెనాలి టౌన్: డంపింగ్ యార్డుకు చేరాల్సిన చెత్తాచెదారం పట్టణ, పరిసర గ్రామాల్లోని ప్రధాన రహదారుల వెంట వెంబడి దర్శనమిస్తోంది. ముఖ్యంగా కొబ్బరి బొండాల వ్యర్థాలను వ్యాపారులు ప్రతి రోజూ గోనె సంచుల్లో ఆటోల ద్వారా తెచ్చి, కఠెవరం నుంచి ఆటోనగర్ వరకు గల నాలుగు లైన్ల ప్రధాన రహదారి వెంట పడేస్తున్నారు. ఇటీవల కురిసిన అధిక వర్షాలకు ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడి అల్లాడుతున్నారు. దీనికి తోడు పారిశుద్ధ్యం కూడా పడకేసింది. బొండాల వ్యర్థాల్లో వర్షపు నీరు చేరి దోమలకు ఆవాసంగా మారాయి. దీని వల్ల ప్రజలు అంటువ్యాధుల బారినపడుతున్నారు.

ఆస్పత్రులకు క్యూ కడుతున్న రోగులు

తెనాలి పట్టణ, మండల పరిధిలో ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. రోజుకు 100 నుంచి 150 కేసుల వరకు జ్వరం, జలుబు, దగ్గు, మలేరియా వంటి వ్యాధుల బారిన పడిన వారు ఉంటున్నారు. తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తెనాలి, రేపల్లె, వేమూరు, చేబ్రోలు, పొన్నూరు, దుగ్గిరాల తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జ్వర పీడితులు వస్తున్నారు. పట్టణ, పరిసర గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేయడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తం

ముఖ్యంగా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. గతంలో రోడ్ల వెంబడి బ్లీచింగ్ చల్లడం, ప్రతి రోజు డ్రెయిన్లలో వ్యర్థాలను తొలగించేవారు. సిబ్బంది కొరత నెపంతో అధికారులు మమ అనిపిస్తున్నట్లు ప్రజల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తెనాలి–గుంటూరు రోడ్డు, పినపాడు–యడ్లపల్లి రోడ్డు, తెనాలి– చినపరిమి రోడ్డు, తెనాలి– పెదరావూరు రోడ్ల పక్కన ఎక్కడ చూసినా చెత్త గుట్టలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల సమస్యను తెనాలి పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం సభ్యులు మున్సిపల్ కమిషనర్‌కు దృష్టికి తీసుకురాగా, నామమాత్రపు చర్యలతో సరి పెట్టారు. కొబ్బరి బొండాల వ్యాపారులు రూట్ మార్చారు. తెనాలి నుంచి విజయవాడ రహదారి, నందివెలుగు నుంచి గుంటూరు రహదారుల్లో వ్యర్థాలను పడేస్తున్నారు. మండల, మున్సిపల్ అధికారులు స్పందించి దీనికి అడ్డుకట్ట వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తెనాలిని జిల్లాగా ప్రకటించాలని వినతి



మంత్రి మనోహర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న యూత్ సభ్యులు

తెనాలి అర్బన్: తెనాలిని జిల్లాగా ప్రభుత్వం ప్రకటించేలా చూడాలని కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూత్ సభ్యులు కోరారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను సోమవారం తెనాలిలో వారు కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. తెనాలి ప్రాంతానికి ఎంతో చరిత్ర ఉందని, ఉద్దండుల పాలనలో తెనాలి కొనసాగుతూ వస్తోందని తెలిపారు. క్విట్ ఇండియా ఉద్యమంలో అనేక మంది అసువులుబాసారని గుర్తు చేశారు. హైదరాబాద్, న్యూఢిల్లీ, చెన్నై, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలకు రోడ్డు, రైలు మార్గాలు కూడా తెనాలి మీదుగా ఉన్నాయని గుర్తు చేశారు. అన్ని అర్హతలు ఉన్న పార్లమెంట్ నియోజకవర్గం లేకపోవడం వల్ల జిల్లాగా తెనాలి రూపుదిద్దుకోలేక పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెనాలిని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్ సంజనా సింహాకు వినతిపత్రం ఇచ్చారు.యూత్ సభ్యులు పి.మధునరావు, జి.నరేష్‌బాబు, పి.హరికృష్ణ, వి.నాని, సభ్యులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ..

తెనాలి అర్బన్: తెనాలి నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగుల సౌకర్యార్థం త్వరలో జిల్లా వైద్యశాలలో ప్రత్యేక సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామం, పట్టణంలోని సుల్తానాబాద్, 9, 10 వార్డులలో సోమవారం ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి పాలడుగు జయనాగలక్ష్మి, ఎంపీటీసీ వెంకట నరసింహా, కౌన్సిలర్లు గోగిరెడ్డి మానసారెడ్డి, కొమ్మరబత్తుని జయపాల్, ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్, ఆర్‌వో రాంప్రసాద్, పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనంలో ఘర్షణ

తెనాలి రూరల్: గణేష్ నిమజ్జనం సందర్భంగా తెనాలిలోని పాండురంగపేటలో ఆదివారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. ఇక్కడి సుగాలీ కాలనీలో వినాయక చవితిని పురస్కరించుకుని గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి నిమజ్జన ఊరేగింపు జరుగుతుండగా డీజే పాటల విషయంలో ఘర్షణ తలెత్తింది. సమీపంలోని మరో విగ్రహ నిర్వాహకులు, ఊరేగింపు చేస్తున్న వారి మధ్య వివాదం తలెత్తింది. దీంతో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకోగా పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఉదయం మిగిలిన వారిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

శ్రీ నరేంద్ర స్వామికి అభిషేకాలు

పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన బాలా త్రిపుర సుందరి సమేత శ్రీరాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో సోమ వారం స్వామి వారికి ప్రాతః కాలంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేష పూజలు జరిపారు. పూజా కార్యక్రమాలను అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించి తరించారు.

వెళ్లి రావయ్యా.. ఏకదంతుడా

- ఘనంగా కొనసాగుతున్న గణపతి నిమజ్జనాలు
- లడ్డూ వేలంలో భక్తులు పోటీ



కఠెవరం గణేష్ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్



మంత్రి మనోహర్‌ను సత్కరిస్తున్న సుల్తానాబాద్ సెంటర్ ఫ్రెండ్స్ సభ్యులు



వేలంలో లడ్డూ దక్కించుకున్న కోడెల ప్రణవ్

తెనాలి టౌన్: రూరల్ మండలం కఠెవరం గ్రామంలో రాజశేఖర్ రెడ్డి సెంటర్లో నిర్వహిస్తున్న వినాయక చవితి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ సోమవారం వేడుకల్లో పాల్గొని గణనాథుని దర్శించి పూజలు చేశారు. గణేశుని ఆశీస్సులు అందరిపై మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. యువత వినాయక చవితి వేడుకను ఆధ్యాత్మిక భావనతో నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు తమ్మ శివారెడ్డి, ఎంపీటీసీ మైల భాను, మాజీ సర్పంచి గంపల శివ నాగేశ్వరరావు, గుమ్మ కోటేశ్వరరావు, చావలి అశోక్ యాదవ్ పలువురు రెడ్డి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వాడవాడలా ఘనంగా వేడుకలు..

తెనాలి టౌన్: వినాయక చవితి మహోత్సవాలు వాడవాడలా ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక సుల్తానాబాద్ మెయిన్ సెంటర్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో సోమవారం రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొని గణనాథుని దర్శించి పూజలు నిర్వహించారు. మండప నిర్వాహకులు మంత్రిని సత్కరించి వినాయకుని చిత్రపటం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ.. దేశ సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా వాడవాడలా గణేష్ మండపాలు ఏర్పాటు చేసి చవితి వేడుకలు నిర్వహించడం యువతలోని ఆధ్యాత్మిక భావనకు అద్దంపడుతుందని పేర్కొన్నారు. గణనాథుని ఆశీస్సులు అందరిపై ఉండాలని కాంక్షించారు. కార్యక్రమంలో దామర్ల నాగేశ్వరరావు, బచ్చు సందీప్, ఆకురాతి రూపేంద్ర, మాచర్ల జగదీష్, ప్రకాష్, విక్రమ్, తదితరులు ఉన్నారు.

రూ.లక్ష పలికిన లడ్డూ ధర..

స్థానిక నందులపేటలోని దేవినేని వెంకయ్య వీధిలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో వినాయక చవితి మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూను వేలం పాటలో రూ.1,10,116లకు కోడెల ప్రణవ్ దక్కించుకున్నారు. అనంతరం వేడుకగా గణేష్ నిమజ్జనం గావించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

తహసీల్దారుకు ఆటో డ్రైవర్లు వినతి



తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

భట్టిప్రోలు: స్త్రీ శక్తి పథకం ద్వారా ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోతున్నారని.. వారికి ఉపాధి అవకాశాలను కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ డిమండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన భట్టిప్రోలులోని శ్రీ లక్ష్మీ గణపతి ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ కార్మికులు స్థానిక బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. బాలాజీ మాట్లాడుతూ.. రోజంతా కష్టపడే ఆటో కార్మికుల జీవనం దుర్భరంగా మారిందని పేర్కొన్నారు. అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసిన కార్మికులు ప్రతి నెలా కిస్తీలు చెల్లించలేక ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం ద్వారా రూ.15 వేలు ఆర్థిక సహాయం అందించాలన్నారు. అనంతరం తహసీల్దార్ మేకా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు బండారు శ్రీనివాసరావు, రైతు ఉద్యమ, ఆటో యూనియన్ అధ్యక్షులు సజ్జా విశ్వనాథం, కట్టా వెంకటేశ్వరరావు, నాయకులు నాగూర్ మీరా, పీటర్ పాల్, అశోక్ కర్రా చిన్నా, శ్రీనివాసరావు, నాయక్, నరసింహ, ఎం.హరి, ఆనందరావు, అమ్రా, హిబ్రూ తదితరులు పాల్గొన్నారు.

దోమల బెడద నుంచి విముక్తి కల్పించాలి

కొల్లూరు: పారిశుద్ధ్య లోపం కారణంగా విజృంభిస్తున్న దోమల నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులకు ప్రజా సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. సోమవారం కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రామాలలో విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో పంచాయతీ యంత్రాంగం దోమల నివారణకు మందులు పిచికారీ చేయడంతో పాటు, బ్లీచింగ్ చల్లించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సుబ్బారావును కోరారు. ప్రధానంగా కొల్లూరులో దోమల బెడద అధికంగా ఉండడంతో తక్షణ చర్యలు చేపట్టి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. తిప్పలకట్టకు చెందిన రైతులు, వ్యవసాయ కూలీలు గత మొక్కజొన్న సీజన్‌లో పౌండేషన్ సీడ్ కంపెనీ ప్రతినిధులు తమతో మొక్కజొన్న విత్తనాలు వేయించి పంటను తరలించుకున్న అనంతరం ఒప్పందం ప్రకారం తమకు ఇవ్వాల్సిన నగదు ఇవ్వకుండా ఇబ్బందులుకు గురిచేస్తున్నారని తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లుకు మొరపెట్టుకున్నారు. రైతులకు ఇవ్వాల్సిన నగదు చెల్లింపులు చేయకపోవడంతో పాటు, వ్యవసాయ పనులకు వచ్చిన కూలీలకు సైతం కూలి నగదు చెల్లించలేదని సంబంధిత కంపెనీపై చర్యలు తీసుకుని తమకు నగదు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బి.సుబ్బారావు, పి.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

చందు సూర్యకు డాక్టర్ సర్వేపల్లి ప్రతిభా అవార్డు



సత్కార కార్యక్రమంలో చందు సూర్య దంపతులు

తెనాలి: గుంటూరుకు చెందిన సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ ఆర్గనైజేషన్, కేవీఆర్ జయలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుంటూరులోని లాం చలపతి ఇంజినీరింగ్ కాలేజీలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ వేడుకల్లో తెనాలికి చెందిన చందు చంద్రమౌళి కళాసేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చందు సూర్యకు ప్రతిభా అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చందు సూర్య దంపతులను ఘనంగా సత్కరించారు. సభకు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. చలపతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్స్ చైర్మన్ వైవీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన 120 మంది ప్రముఖులకు ఈ అవార్డును బహూకరించారు.

ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



ఎరువుల స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

తెనాలి టౌన్: అధిక వర్షాల కారణంగా పంటలు పాడై ఇబ్బందులు పడుతున్న రైతాంగానికి ఎరువుల కొరత సృష్టిస్తే సహించేది లేదని.. అటువంటి చర్యలకు పాల్పడే డీలర్లు, ఎరువుల షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కొమ్మాలపాటి చంద్రశేఖర్ హెచ్చరించారు. స్థానిక వ్యవసాయమార్కెట్ యార్డులోని జీడీసీఎంఎస్ కేంద్రాన్ని సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పరిశీలించారు. ఎరువుల స్టాక్ వివరాలను పరిశీలించి రికార్డు చేశారు. యార్డుకు వచ్చిన రైతులను పలకరించి సకాలంలో ఎరువులు అందుతున్నాయా లేదా అని విచారించారు. అనంతరం పట్టణంలోని పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించి రికార్డులు పరిశీలించారు. అదే విధంగా పలు గోడౌన్‌లు, హోల్‌సేల్ షాపుల్లో రికార్డులు పరిశీలించారు. ఆరుగాలం కష్టించే రైతుకు అందరూ అండగా ఉండాలని.. ఎరువుల కొరత సృష్టించి దోపిడీకి పాల్పడవద్దని వ్యాపారులకు సూచించారు. తనిఖీల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.శివాజీ, మండల వ్యవసాయాధికారి కె.సుధీర్ బాబు, వ్యవసాయాధికారి సీహెచ్ ఆదినారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు



నూతన సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న పూర్ణచంద్

తెనాలి రూరల్: రోటరీ క్లబ్ ద్వారా రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం గవర్నర్ డాక్టర్ సోమవరపు వెంకటరాంప్రసాద్ తెలిపారు. క్లబ్ గవర్నర్‌గా ఆయన అధికారిక పర్యటన తెనాలిలో సోమవారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 12 మంది కొత్త సభ్యులు చేరారు. వారితో అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ ప్రమాణం చేయించారు. అలానే పవర్ లిఫ్టింగ్ గోల్డ్ మెడలిస్ట్ షేక్ సబీనాకు అవసరమైన దుస్తులను బహూకరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్, డిస్ట్రిక్ క్యాబినెట్ గుత్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళీకృష్ణ, చేతన్ రాజ్ కొఠారి, డాక్టర్ ధూళిపాళ్ల రవీంద్రనాథ్, కుదరవల్లి రామ్మోహన్‌రావు, యశ్వంత్, మల్లాది అర్జున, బత్తుల వెంకటేశ్వరరావు, బోర్డు సభ్యులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికను వినియోగించుకోవాలి

రేపల్లె: ప్రజలు తమ సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీల రూపంలో తీసుకువచ్చి సత్వరమే పరిష్కరించుకోవచ్చని ఆర్డీవో నేలపు రామలక్ష్మి తెలిపారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. పలువురు ఇచ్చిన ఎనిమిది అర్జీలను వివరించారు. తమ వీధికి సీసీ రోడ్డును మంజూరు చేయాలని భట్టిప్రోలు మండలం ఐలవరంకు చెందిన మాచర్ల మాధవరావు అర్జీ అందించారన్నారు. తమ భూమికి జరిగిన రీసర్వేలో భూమి విస్తీర్ణం తగ్గిందని.. రీసర్వే మరోమారు చేయాలని చెరుకుపల్లి మండలం కొండపల్లికి చెందిన యేమినేని వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారన్నారు. దివ్యాంగుల పింఛన్ మంజూరుకు రేపల్లె నుంచి పమిడిమల కోటేశ్వరరావు అర్జీ చేశారన్నారు. అర్జీలను పరిశీలించి సంబంధిత శాఖల అధికారుల ద్వారా త్వరితగతిన పరిష్కరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.